నాలుగవ మజిలీ

సింగరాజు రామచంద్రమూర్తి

'నిలబడి ఉన్నారేం, కూర్చోండి. తాతా మాస్టారు కూర్చుంటామేమిటోయ్ మంగరాజా, లే వారు కూర్చుంటారు' అన్నాడు డాక్టరు మూర్తి.

'ఫరవాలేదు నాయనా, నిలబడగలను. కాకపోయినా కూర్చోవాలంటే ఇటు పక్కన బల్లమీద స్థలం ఉందిగా.'

'అబ్బెబ్బె, మీరటు కూర్చుంటే డాక్టరుగారు ఊరుకుంటారా? రండి సార్' అంటూ గభాలున కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు మంగరాజా.

నాకీ హడావుడి నచ్చలేదు. మాఅబ్బాయి డాక్టరు మూర్తికి స్నేహితుడే కావచ్చును. అంతమాత్రాన ప్రత్యేకత చూపించకూడదు. అందుకని ఆ మాటే అనేశాను కూడా.

'ఇటువంటి మర్యాదలు నాకు నచ్చవోయ్ మూర్తీ! డాక్టరు ఈ స్నేహాలు అన్నీ

పట్టించుకోకూడదు. అందరూ సమానులే! మనకి ఈ మొహమాటాలు చావవు కనుకనే మనవాడెవడూ వ్యాపారంలో బాగుపడడు.'

నవ్వేశాడు మూర్తి.

'పోనీ పరిచయాన్ని అవతల పెట్టె యండి. మీ వయస్సుకయినా మర్యాద ఇవ్వద్దూ?'

ఛెళ్ళున కొట్టినట్లయింది నాకు. ఈ మధ్యను ఎక్కడికి వెళ్ళినా ఇదొక బాధయిపోయింది నాకు. 'పెద్దవారు నిలబడలేరు' అంటూ వేధన జాలి చూపిస్తారు. నా మీద ఎవరయినా జాలి పడితే నాకు పరమ అసహ్యం. ఈ లోకంలో నేను పనికిరాను అని వాళ్ళు చెబుతున్నట్లుంటుంది నాకు.

'నేనూ చిన్నప్పుడు బాగా వ్యాయామం చేసినవాడి నేనోయ్, క్రికెట్టు బ్రహ్మాండంగా ఆడేవాడిని. జ్వరం వచ్చి ఇంటర్ యూనివర్సిటీ సెలక్షన్స్‌లోకి పోలేక పోయాను.'

ముసలివాళ్ళకిలా మాట్లాడడం మామూలే అన్నంత తేలిగ్గా నవ్వేశాడు అతను. తరువాత లేచి స్టెతస్కోపుతో నా గుండెల్ని కాసేపు పరీక్షించాడు. రక్తపు పోటు కాసేపు పరీక్షించాడు. అవన్నీ అయినాక తన సీటులో పోయి కూర్చున్నాడు మాట్లాడకుండా.

నాకీ నిశ్శబ్దం చిరాకు కలిగించింది. సినిమాల్లో 'ఒక్కసారి మీరిలా రండి' అంటూ రోగి బంధువుని దూరంగా తీసుకెళ్ళి పెదిమ విరవడం గుర్తుకొస్తోంది.

'అదేక నేను గోపాల్‌తో మాట్లాడుతాను గానీండి బాబాయిగారూ, మీరిక డిస్పెన్సరీకి రాకండి ఇహనుంచి.'

'ఏం వేనొస్తే నీకిబ్బందిగా ఉంటుందా?'

'అమ్మమ్మ, భలే మాటనేశారే! మీ గుండె పరిస్థితి ఏమీ బాగాలేదండి. రక్తం పోటు కూడా ఎక్కువవుతోంది. అందుకని ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటూండండి. ఆలోచనలు తగ్గించుకోండి...ఇదుగో రమణరావుగారూ, రిక్షా ఒకటి పిలిచి బాబాయిగార్ని ఎక్కించండి.'

'నే వెళ్లను' అన్నాను.

ఖంగారుపడ్డాడు మూర్తి. 'మీరు రెస్ట్ తీసుకోవాలండి.'

'కాసేపు ఇక్కడ కూర్చుంటే నీకేమయినా ఇబ్బందా ?'

'మళ్లీ మీరా మాట అంటే నన్ను...'

'మరిహ మాట్లాడకు. నన్ను కూర్చోనీయ్. వంటరిగా ఉంటే బోరు కొడుతుంది.'

మూర్తి ఇబ్బందిగా ముఖం పెడితే జాలేసింది. 'అతనికి నా పట్లగల అభిమానంవలన ఆ రకంగా అంటున్నాడు—అతని మాట వింటే ఏం పోయిందీ' అనుకుని లేద్దామనుకుంటుండగానే ఒక కుర్రాడు హడావుడిగా లోపలికి పరుగెత్తుకొచ్చాడు.

అతను మహాలక్ష్మి మనమడు.

'డాక్టరుగారూ, మా తాత మిమ్మల్ని మళ్లీ ఒకసారి రమ్మన్నాడండి. అమ్మమ్మ ఏమిటోలా ఉంది' అన్నాడు రొప్పుతూ.

నన్నెవరో వెన్నుమీద చరిచినట్లయింది. 'ఏమిటి వీళ్ల అమ్మమ్మకి జబ్బు?' అనడిగాను మూర్తిని.

అలా అడగడంలో అతనేమయినా అనుకుంటాడేమోనన్న ధ్యాసే లేదు ఆ ప్రశ్న అడిగేప్పుడు నాలో.

'నువ్వు వెళ్లవోయ్, ఇప్పుడే వస్తున్నానని చెప్పు.' అని ఆ కుర్రాడు వెళ్లిపోయాక 'మహాలక్ష్మమ్మ పదిహేను రోజులుగా మంచంమీద ఉంది. ఈరోజు గడవదు కూడా' అన్నాడు మూర్తి.

మెడికల్ చెస్ట్ సర్దుకుని 'మరి నే వెళ్లివస్తాను బాబాయిగారూ' అంటూ బయటికి వెళ్లిపోయాడు.

నాకు మనస్సంతా అదోలాగయిపోయింది.

మహాలక్షమ్మ అంటే అప్పట్లో వారందరికీ బాగా గుర్తు. మాతరం యువకులు చాలామంది మనసుల్లో దీపం అయి వెలిగింది. నీతి నిజాయితీ మీద పెద్దగా గురి గౌరవం లేని కుటుంబం వాళ్లది. అలాగని మరీ వీధిన పడ్డారని కాదు.

మా ఇంటి దొడ్డివాకిలి వైపు వాళ్ల ఇల్లుండేది. అప్పటికి మహాలక్ష్మికి పెళ్లి కాలేదు. మనిషి మాత్రం గుర్రంలా ఎదిగి ఉంది. శలవులకి నేను ఇంటికి రావడం ఆలస్యం. నాకు వినబడేలా పాటలు పాడేది. ఎవరితోనో అంటున్నట్లు నన్నుద్దేశించి మాట్లాడేది. ఇవన్నీ అది వయస్సులోకి వచ్చిన మొదటి రోజులలో నన్నమాట.

రాను రాను మనిషి కొంచెం శృతిమించింది. సైగలు చేసేది. అటుకేసి రమ్మన్నట్టు తను ఫలానాచోట ఉంటానన్నట్లు గుర్తులు చెప్పేది.

నేను వసుధః చొరవలేని మనిషిని. దానికితోడు మా అమ్మ వాళ్లకి మహాలక్ష్మి తత్వం తెలిసి ఉండటాన ఒక కన్ను నా మీద వేసి ఉంచేవారు. పైగా "ఫలానీ వారబ్బాయి అబ్బో శ్రీ రాముడు' అని అనిపించుకోవాలన్న తాపత్రయం నాకు ఉండేదనుకుంటాను అప్పట్లో. ఇవన్నీ కలిసి నాలోని ధైర్యాన్ని చంపాయి.

కాకపోతే ఆ అమ్మాయి అలా చొరవ తీసుకుంటూ ఉండడం మాత్రం నాకు చాలా సరదగా ఉండేది. అందుకనే నేనంటే విసుగు పుడుతుందేమోనన్న భయంతో మధ్య మధ్య మహాలక్ష్మి వంకచూసి నవ్వడం వంటివి చేస్తూ మా మధ్యనున్న ఆ మూగ స్నేహం చావకుండా చూస్తుండేవాడిని.

నాకన్న సంవత్సరం ముందు మహాలక్ష్మికి పెళ్లయింది.

నాకూ పెళ్లయి మా రాజ్యం కాపరానికి రావడంతో నా పట్ల మహాలక్ష్మి శ్రద్ధ సన్నగిలి పోతుందనుకున్నాను కాని అలా కాకపోగా మా ఆవిడ చూస్తుందన్న భయమయినా లేకుండా నన్ను చూపులతో వేటాడేది. రాజ్యం చూస్తుందేమోనని ఖంగారుగా ఉండేది నాకు.

ఒకసారి శ్రావణమాసం నోములకి పిలిచేందుకు మా ఇంటికి వచ్చింది మహాలక్ష్మి. ఇంటో నేనూ, మా రాజ్యం మాత్రం ఉన్నాము.

'అక్కయ్యగారూ' అంటూ లోపలికి వచ్చి నన్ను చూసి నవ్వింది. అంత వరకూ నాతో మాట్లాడుతున్నదల్లా మా రాజ్యం గభాలున లేచి,

'పంపు దగ్గర బిందె ఉంది. తీసుకొస్తాను-- ఇక్కడే ఉండు మహాలక్ష్మీ' అంటూ దొడ్లోకి వెళ్ళింది.

నన్నుచూసి మళ్లీ నవ్వింది మహాలక్ష్మి. ఆ నవ్వు నా మగతనాన్ని సవాలు చేస్తున్నట్లు అనిపించింది నాకు. గభాలున లేచి మహాలక్ష్మిని రెండు చేతులతోను పొదివి పట్టుకుని గట్టిగా ముద్దుపెట్టుకున్నాను.

అంతలో మా ఆవిడ రావడంతో 'థాంక్స్' అని గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్లిపోయింది మహాలక్ష్మి. అయితే ఆ 'థాంక్స్' నాకో మా ఆవిడకో అర్థం కాలేదు నాకు.

మూర్తి రాకతో నా ఆలోచనలని ఆపి లేచి నిలబడి 'ఎలా ఉందయ్యా ఆవిడకి?' అనడిగాను.

'పోయిందండి'

క్షణకాలం కళ్లు మూసుకున్నాను. నవ్వుతూ, కవ్విస్తూ నేను గుర్తుంచుకున్న మహాలక్ష్మి అగపడింది.

మాట్లాడకుండా బయటకు వచ్చి నేరుగా మహాలక్ష్మి ఇంటికేసి నడిచాను. ఆవిడ మొగుడు ఫాన్సీ దుకాణం పెట్టి బాగా సంపాయించి పెద్దబజారులో ఇల్లు కట్టాడు.

నే వెళ్లేసరికి తతంగం జరుగుతూంది. పసుపు కుంకుమ జల్లారు. ఆ పసుపు కుంకుమల మధ్యగా పండిన ముత్తైదువులా కనబడింది మహాలక్ష్మి మొహం.

'ఊళ్లోని పెద్ద ఘటాలు ఒకొక్కరు రాలిపోతున్నారు' అన్నాడు ఒకాయన. ఆ మాట విన్న ఇద్దరు ముగ్గురు నావంక చూసిన చూపు ఎందుకో నాకు గుండెల్లో గుచ్చుకున్నట్లయింది.

'ఇదుగో పాపం ఈయన ఉన్నాడు. ఇంకెంత కాలంలే? రోజులలో పడ్డాడు' అంటున్నట్లనిపించింది.

మహాలక్ష్మి మొగుడ్ని పరామర్శించుదా

మనుకున్న వాడినల్లా వెనక్కి తిరిగి ఇంటికి బయలుదేరాను

'ఏెవి మహలక్ష్మి పోయిందిటగా' అంది రాజ్యం ఇల్లు చేరగానే

మాట్లాడకుండా రాజ్యంవంక చూశాను

మనిషి వడిలిపోయింది జుట్టు ముగు బుట్టు కూర్చుంటే లేవలేదు ఏభైయి సంవత్సరాల క్రితం రాజ్యానికి ఇప్పటికి తేడా ఏమిటి? అరవిరిసిన పువ్వులా ఇంటికి వచ్చింది అప్పుడు. .

నవ్వింది రాజ్యం 'ఏమిటి అలా చూస్తున్నారు?'

'మనంమాత్రం ఇంకెన్నాళ్ళు బతుకుతా మంటావు రాజ్యం? ఈ నాలుగవ మజిలీ దాటడంలో ముందు వెనక అంతే ఈ పందెంలో ఎవరు గెలిస్తే వారు అదృష్ట వంతులు'

'నిజంగా మహలక్ష్మి చావు ఎందరికి వస్తుందంటారు? ఇంత పసుపు, కుంకుమలతో వెళ్ళిపోయింది అంతటి అదృష్టంకోసమే ఎదురుచూస్తున్నాను. ఈరోజే అది అయితే మహానందం'

'అవేంమాట అత్తయ్యా శుభమా అని అయినా మావయ్యగారికి ఊళ్ళోని ఆలోచనలన్నీ కావాలి మనవళ్ళ చదువులు, పెళ్ళిళ్ళు ఇంకెన్ని జరగాలి విూచేతి విూదుగా' అంది అప్పుడే లోపలికి వచ్చిన సువర్చల.

సువర్చల మా రెండవకోడలు.

'తాతయ్యా, తాతయ్యా ఇందాకనుంచి ఎక్కడికి వెళ్ళావు నాకు చెప్పకుండా' అంటూ మా మోహనుడువచ్చి అమాంతం నా వడిలోకి ఎగిరాడు.

ఎందుకనో ఒళ్ళంతా కుదిపినట్లయింది వాడు ఎగిరిన ఎగురుకు 'అబ్బ, మెల్లిగా నాన్నా' అన్నాను—వాడు ఎక్కడ పడతాడోనని పొదివి పట్టుకుంటూ.

'వెధవ కానా, తాతయ్యవిూదికి అలా ఒంటికాలివిూద ఎగురుతావేం?' తాతయ్య పెద్దవారని ఎన్నిసార్లు చెప్పాలి నీకు' అంది సువర్చల కొడుకుని కోప్పడుతూ.

'పెద్దవాడినేలే అమ్మాయ్, కాని చిన్న వాడిదగ్గర మనమూ చిన్నవాడిలా ఉంటేనే వాడికి మనకి మధ్యస్నేహం పెరుగుతుంది'

'వీడి హడావుడికి తట్టుకోవద్దూ మీరు? ఇందాకటే! అత్తయ్యని మీకు ఓపికలేదు

నాలుగవ మజిలి

పడుకోండత్తయ్యా అంటే పసివేళా శైలజని ఎత్తుకున్నారు అది కాస్త కూస్త పిల్ల ఏమన్నానా! చంకలో కూర్చుని ఒక్క ఎగురు ఎగిరింది ఈవిడేమో అపళంగా వెనక్కి పడి పోయారు అప్పుడు తేనెలూ, గ్లూకోజులూ నానా ఖంగారయిపోయింది పెద్ద తనమా మంగోహటా?'

నాకు చర్రున కోపం వచ్చేసింది మాట్లాడితే పెద్దతనం, పెద్దతనం అందుకనే 'ఒరేయ్ వెధవాయ్, మేం పెద్ద వాళ్ళం మా దగ్గరకు ఎవరూ రాకండి' అన్నాను వీధిలోవున్న మోహనుడ్ని

వాడు తెల్లబోయాడు సువర్చల కూడా మాట్లాడకుండా వెళ్ళిపోయింది లోపలికి

నిద్దరోతున్నవాడినల్లా దాహంవేయడం వలన మెలకువ వచ్చేసింది 'అమ్మాయి సువర్చలా' అని పిలవబోయినవాడినల్లా ఆగిపోయాను.

అబ్బాయి, కోడలు గదిలో మాట్లాడు కోవడం వినబడుతోంది.

'మరీ మీ నాన్నగారికి 'పెద్దవారు మీరు' అంటే కోపం' అంది సువర్చల.

'అవునే, నాకు ముప్ఫయి ఏళ్ళు ఒక్క పిల్లాడు ఉన్నప్పుడు నేనింకా చిన్నవాడినే నన్న భావం ఉండేది. ఇప్పుడు ఇద్దరు



పుట్టాక పెద్దవాడినయిపోయా ననిపిస్తోంది'

'దానికీ, దీనికీ సంబంధం ఏమిటో?'

'పెద్దవాడి నయ్యానన్న భావం కొంచెం బాధగా గూడా ఉంటోందని.. 'నాలో శక్తి ఉంది' అని పెద్దవాళ్ళు కూడా వారిని వారు నమ్మించుకుందుకు ప్రయత్నిస్తారు అటువంటి సమయంలో పాటికి పదిసార్లు మీరు పెద్దవారు, మంచోలేరు, పడుకోండి అని అనడం కొందరికి విసుగ్గా అనిపిస్తుంది అప్పుడే వాళ్ళని 'చివరి ప్రయాణానికి' తయారు చేస్తున్నట్లు బాధ పడతారు'

'అత్తయ్య మాత్రం పెద్దవారు కారూ?'

'మగాడికి అహంకారం ఉంటుంది. అది చావకూడదు ముసలివాడి ననుకుంటే ఇంకా ఏం కారం ఉంటుంది!'

సువర్చల విసుక్కుంది 'ప్రతిదానికి ఏమిటో మాట్లాడతారు' అంటూ

'చూడు సువర్చలా నీకు నాకూ తలి తండ్రులున్నారు వాళ్ళ నలుగురూ బ్రతికి ఉండటం మన అదృష్టం అంటాను వాళ్ళు చల్లగా ఉన్నన్నాళ్ళు మనం చిన్న పిల్లలమే! అది ఎంత తృప్తి నిస్తుందంటావు! నా కెప్పుడూ ఎవ రయినా పోయారని వింటే ఇదే భయం పట్టుకుంటుంది మీ నాన్నగారు, అమ్మ పెద్దవారయిపోయారని, వాళ్ళా ఒక రోజున ఆలోచించలేను సువర్చలా ఆపైన. అంత భయం వేస్తుంది మా ఆఫీసులో ఎక్కువమంది నా వయస్సువాళ్ళే ఏడాదికి ముగ్గురు నలుగురికి తండ్రో, తల్లో పోతున్నారు నా వంతు ఎప్పుడు వస్తుందో నని వణికిపోతుంటాను

అందుకనే నే చెప్పేది వీళ్ళింక ఎన్నాళ్ళో ఉండరు ఉన్నన్నాళ్ళు వీళ్ళ మనస్సు నొప్పించకుండా ప్రవర్తించుకోడం - మన విధి ఇహ పడుకోనియి నన్ను

నాకు దాహం ఎగిరిపోయింది.

నిద్ర లేచేసరికి ఇల్లు కొంచెం హడా విడిగా ఉంది. రాజ్యం మంచంమీద పడు కుని ఉంది

గభాలున దగ్గరకు వెళ్ళి 'రాజ్యం ఏమిటి పడుకున్నావు?' అనడిగాను.

మాట్లాడలేదు

తట్టి పిలుద్దామని చేయి వేసేంతలో వేణుగోపాలుడు వచ్చాడు. 'అమ్మకి జ్వరం వచ్చింది నాన్నగారూ, ఇందాక శైలజని వేసుకొని పడిందిట. చెబుతే వినదు పెద్దతన మమ్మా అంతతాపత్రయం ఉండకూడదంటే పిల్లల్ని పట్టుకుని వదలదు. వంటింట్లో చాప వేసుకుని పడుకుని ఉంటే అనుమానం వచ్చి చూశాను. వళ్లు కాలిపోతోంది' అన్నాడు.

అలా చూస్తుండిపోయాను.

పరుపుమీద ఉందా, లేదా అన్నట్టుగా అతుక్కుపోయి ఉంది రాజ్యం. పూర్వపు ఆ నునుపు, శక్తి ఏమయిపోయాయి ఈ మనిషిలో. నాచేత ఒక్క పనికూడా చేయ నీయకుండా నా పనులూ, ఇంటి పనులూ



ఎక్కడ
లైఫ్‌బాయ్ వున్నదో
అక్కడ ఆరోగ్యము వున్నది

లైఫ్‌బాయ్ తో స్నానము మీకు అత్యంత ఆరోగ్యవంతమైన హాయి గొలుపుతుంది. లైఫ్‌బాయ్‌లో ఉత్తమమైన సబ్బులో వుండ వలసిన అన్ని సుగుణములే గాక ఇంకా ఎన్నియో వున్నవని మీరు తెలిసికొందురు.

లైఫ్‌బాయ్ మురికిలో గల క్రిములను కడిగి వేస్తుంది

హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి

L.51-140 TE

తనే స్వయంగా చేసుకుపోయేది. కష్ట సుఖాల్లో పాలు పంచుకుని నాకు ఆనందాన్ని, తృప్తిని కలిగించడమే తన లక్ష్యమన్నట్లుండేది. మాది ఏభయిసంవత్సరాల స్నేహం. అటువంటి మనిషి ఈనాడు... అయిపోయిందా – నన్ను నామానాన వదిరి వెళ్ళిపోతుందా? ఒంటరిగా నా జీవితం...

'నాన్నగారికి కూడా బత్తాయి రసం ఇస్తున్నావా? ఇంతసేపా?' అంటున్నాడు వేణుగోపాల్.

'తీసుకోండి మావయ్యా'

'నాకేం వద్దమ్మా' అన్నాను. సీటిపొరల గుండా రాజ్యం అగపడుతోంది.

తిరిగి నా గదిలోకి వెళ్ళిపోయాను.

'మీ నాన్నగారి కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి చూశారు' అంటోంది సువర్చల మెల్లిగా.

'అవును. ఆయన మా అమ్మని ఏనాడూ కష్టపెట్టలేదు. బలహీనురాలని కంటికి రెప్పలా, పిల్లలా కాపాడారు.'

అది పిల్లల అభిప్రాయం. నిజానికి నిజం కూడా అదే నేను రాజ్యంమీద ఏనాడూ చేయి చేసుకుంచిలేదు ఎప్పుడయినా తిట్టినా అది దాని మంచికోసమే.

మా పెద్దవాడు పుట్టినతరువాత మనిషి మరీ బలహీనంగా ఉందని డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళి పరీక్ష చేయించి మందులు తెచ్చి రోజూ వాడమన్నాను. రాజ్యానికి మందులమీద నమ్మకం బొత్తిగా లేదు... తీసుకుంటున్నానని చెబుతుండేది. ఒకరోజు అనుమానం కలిగి చూస్తే మందులన్నీ అలాగే ఉన్నాయి. నాకు వళ్ళు మండిపోయింది. చచ్చేటట్లు చీవాట్లు వేశాను. కోపం తగ్గలేదు. చేయెత్తాను. కాని కొట్టబుద్ధి కాలేదు కోపం తగ్గలేదు. ఆ మందులన్నీ తీసుకుపోయి రోడ్డుమీద పారేశాను.

మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి మందులన్నీ ఏరితెచ్చుకుని అలమారులోపెట్టింది పారేయడంలో పగిలిపోయినవి కూడా తెచ్చుకుంది.

జాలేసింది. సాయంత్రం మళ్ళి కొత్తవి తెచ్చాను. ఆనాటినుంచి ఇప్పటిదాకా మందు తాగకసలేదు...

కొంచెం కాలంపాటు స్నేహితులుగా ఉండ విడిపోతుంటే ఆ ఎడబాటుకి బాధ పడతారు. కావాలంటే–డబ్బుకు లక్ష్యపెట్టకపోతే–వాళ్ళు ఎప్పుడు కావాలంటే అప్పుడు కలుసుకోగలరు. అయినా విచారపడతారు. మెత్తని మనస్సుగలవారయితే ఏడుస్తారు.

అటువంటిది ఏభయిసంవత్సరాల స్నేహం తరువాత ఎడబాటు కలుగుతే – అందులోనూ మళ్ళీ జీవితంలో ఎంత ప్రయత్నించినా కలుసుకోలేని ఎడబాటుకలుగుతే...

గుండె బరువెక్కిపోయింది. నొప్పిగా కూడా ఉంది. డాక్టరు మూర్తి 'ఆలోచించవద్దు' అంటాడు కాని ఎలా? కదలద్దంటాడు. అయినా లేచాను. ఎందుకో రాజ్యం నానుంచి దూరమయిపోతుందన్న దిగులు నన్ను బలహీనుడ్ని చేసేస్తోంది. రాజ్యం పడుకున్న మంచం దగ్గరగా వెళ్ళి నిలబడ్డాను.

ఏదో లోకంలో ఉండి ఊపిరి పీలుస్తున్నట్లుంది.

'రాజ్యం' మెల్లిగా పిలిచాను.

పలకలేదు.

పడక కుర్చీ లాక్కుని ఆమె మంచం పక్కనే కూర్చున్నాను.

నాకు కొన్ని ప్రిన్సుపుల్స్ ఉండేవి. నా పనులు నేను చేసుకోవడం అందులో ముఖ్యమయినది. చిన్నతనంనుంచి తలంటుకోవాలన్నా నా అంతట నేనే అంటుకునేవాడిని. రాజ్యం కాపరానికి వచ్చినా కూడా అదే అలవాటు కొనసాగించ దలుచుకున్నాను. అయితే నేను ఊహించనిది ఒకటి ఉందన్న విషయం తరువాత తెలిసింది.

ఏదో పత్రికలో పడిన వ్యాసం ఒకదాన్ని తెచ్చి నాకు ఇచ్చింది రాజ్యం ఒకరోజున.

'ఎందుకు?' అని అడిగితే 'చదవండి మిమ్మల్ని గురించే' అంది నవ్వుతూ.

ఆడది తన భర్త తనమీద పూర్తిగా ఆధారపడితే ఎంతగా ఆనందపడుతుందో వివరించే వ్యాసమది.

చదివి 'రేపటినుంచి' అన్నాను నవ్వుతూ.

ఆ రోజు మొదలు నాలో బద్ధకం పెరిగిపోయింది. ప్రతి చిన్న పనికి రాజ్యం కావాలి. అదే మహారాజయోగం ఈనాటిదాకా జరిగింది నాకు. చెబితే సిగ్గుగా ఉంటుందిగాని బంధువులెవరయినా వాళ్ళ



'మీనా' డీజల్ ఇంజన్
6 HP 650 R.P.M.
ఉత్పత్తిదారులు : —
శ్రీ తిరుమలై ఇంజనీరింగ్ కార్పొరేషన్,
191 శివాజీ ఉద్యమ నగర్,
కొల్హాపూర్, (మహారాష్ట్ర)
ఆంధ్రప్రదేశ్‌లో జిల్లావారీ ఏజెంట్లు కావాలి

భద్రతకు, రక్షణకు పోల్డింగ్ 50 షాట పిస్టల్ లైసెన్స్ అక్కర్లేదు. అమెరికన్ మోడల్. దొంగలు క్రూరమృగాలనుండి రక్షించుకోండి. ఫిక్‌నిక్ ప్రయాణములు, నాటకాలకు ఉపయోగకరమైనది. ఆటోమెటిక్ 50 షాట్లు



పేల్పటుగలదు తేలికైనది. నిప్పురవ్వలు మిమ్ము అపాయంనుండి రక్షిస్తుంది జర్మన్ మోడల్ నెం.99 50 షాట్లతో ధర, రు.15.50 వి పి పి చార్జీలు రూ2.50 తోలుకేస్ రు3-50 అదనం షాట్సుసందకి రు5 మిల్టరీ జవాన్లకు ఆఫీసర్లకు ప్రత్యేక తగ్గింపు.
ATLAS CO (-16)
P.O. Box 1329 Delhi-6

వాయిదాల చెల్లింపుపై ట్రాన్సిస్టర్
రు. 320/- విలువగల ప్రపంచ ప్రఖ్యాతిగల 'ఎస్కార్ట్' 3 బ్యాండ్ ఆల్ వరల్డ్ పోర్టబుల్ ట్రాన్సిస్టర్ నెలకు రు 10/- వంతున వాయిదాలపై చెల్లించి పొందండి. ఇండియాలోని ప్రతి పట్టణ & పల్లెలకు పంపెదము. వ్రాయండి.

JAPAN AGENCIES, (AP 10)
Post Box 1194, Delhi-6.

ఇంటికి పిలిస్తే వెళ్ళేందుకు సందేహించే వాడిని. ఆ కొన్నాళ్ళు ఎడబాటు భరించ వలసి ఉంటుందని.

రాజ్యం లేని జీవితం ఊహించుకోలేను. నే నెవరికీ అన్యాయం చేయలేదు. భగవంతుడు కరుణామయుడంటారు. నా ఈ కోర్కె తీర్చలేడూ!

ఎదురుగా గోడకి వేళ్లాడదీసి నిత్యం ధూపదీప నైవేద్యాలందుకుంటున్న ఆ విగ్రహాన్ని చూస్తూండిపోయాను అలాకూర్చుంటే గుండెనెప్పి రానురాను ఎక్కువ కాసాగింది. కళ్ళు మూసుకున్నాను కాసేపు ఆ విగ్రహం శిలగా కనబడి అదృశ్యమయింది...

చిటపట లాడుతూ మండిపోతోంది వాటి మధ్యన నా రాజ్యం భౌతికరూపం అదృశ్యమయిపోతోంది. చూస్తూ ఉండిపోవడం తప్ప నే చేయగలిగిందిలేదు.

వెనకనుంచి శ్రీనివాసు నన్ను మెల్లిగా తట్టి 'అయిపోయింది పదండి నాన్నగారూ' అన్నాడు.

యాంత్రికంగా వెనక్కి తిరిగి రాజ్యం లేని లోకంలోకి అడుగు పెట్టాను...... దూరంగా మా ఇల్లు అగపడుతోంది.

మా అమ్మని దహనంచేసి ఇంటికి వచ్చి రాజ్యం వడిలో తల పెట్టుకుని 'ఒంటరి వాళ్లమయిపోయాము రాజ్యం' అని బావురు మన్నాను ఒకనాడు.

కాని ఈనాడు నా రాజ్యం ఏది? ఎవరు నన్ను ఓదార్చేవాళ్ళు?... 'ఒంటరి పక్షినయాను' అనుకున్నాను. ఆ నిజం నన్ను దహించివేస్తూంది.

అరుగుమీద కూలబడ్డాను. ఈ గడచిన ఇన్ని సంవత్సరాలుగా రాజ్యం నా పక్కన లేకుండా నేను పడుకున్న రోజులు బహు కొద్ది. ఎవరయినా ఏమయినా అనుకుంటారేమోనన్న భయంలేకుండా ప్రత్యేకం మా ఇద్దరికోసం ఒక పడకగదికూడా కట్టించాను. మా ఇంట్లో అదొక పవిత్ర దేవాలయంగా చూసుకునేది రాజ్యం.

ఆ గదిలోకి వెళ్ళాను. గదంతా బోసిపోతోంది. 'రాజ్యం' అని పిలిచాను.

ఎవరు పలుకుతారు?

'రాజ్యం' పెద్దగా పిలవాలనుకున్నాను గొంతుపూడిపోయింది. కుళ్ళికుళ్ళి ఏడ్చాను.

నా కన్నీటితడికి నాకే మెలకువ వచ్చేసింది. ఊపిరి అందటం లేదు.

కళ్ళు విప్పి చూస్తే నాకు మొదటగా కనబడింది నా కాళ్లదగ్గర పెద్ద బొట్టుతో కూర్చుని ఉన్న రాజ్యం. నా ఆనందం వర్ణనాతీతం. నా రాజ్యం నాకు దూరం కాలేదు. కాకూడదు.

'రాజ్యం' పెద్దగా పిలుద్దామనుకున్నాను కాని పెగిలిరాలేదు.

నా ముఖంలోకి ఆదుర్దాగా చూస్తోంది రాజ్యం. గుడ్లనీరు గుడ్లలోనే కుక్కుకుంటోంది

'స్పృహ వచ్చినట్లుంది పిలవండి' అంటున్నారు ఎవరో. ఎవరో నాకు తెలియడం లేదు. నూతిలోంచి వినబడుతున్నట్లున్నాయి వాళ్ల మాటలు.

ప్రయత్నంమీద కళ్ళు తిప్పాను. శ్రీనివాసు అగపడ్డాడు

వీ డెప్పుడు వచ్చాడు? పక్కనే వాడి భార్య పద్మావతి నిలబడి ఉంది. ఏడుస్తోంది.

నా కాశ్చర్యం వేసింది. తల తిప్పి చూడబోయాను. కాని సాధ్యం కాలేదు.

'నీ కోసం చూస్తున్నారురా నాన్నగారు—వేణూ ఇటురండి' అని శ్రీనివాసు మాటలు కాబోలు మెల్లిగా వినబడ్డాయి.

వేణు, వాడి భార్య సువర్చలా వచ్చి శ్రీనివాసు పక్కన నిలబడ్డారు.

గుండెల్లో నెప్పిగా ఉంది. ఊపిరి ఆడనట్లుగా ఉంది.

'ఏమిటి దంతా?' ప్రయత్నం మీద అడిగాను.

'ఏమిటో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నాడురా ఆయన చూడటం లేదూ' అన్నారెవరో.

నా మాటలు బయటికి రావడం లేదన్నమాట.

'ఏమిటి నాన్నగారూ?' అడుగుతున్నాడు శ్రీనివాసు నా చెవిదగ్గర నోరుపెట్టి.

సాధ్య మయినంత కలయ చూశాను. నాకు ఆక్సిజను ఎక్కిస్తున్నారనుకుంటా. రాజ్యం వైపు చూశాను. గొల్లున ఏడుస్తుంది.

అప్పుడర్థమయింది.

డాక్టరు మూర్తి నాడి పరీక్షిస్తున్నాడు. అతని ముఖంలో ఆందోళన ప్రస్ఫుటంగా అగపడుతోంది

మళ్లీ రాజ్యం వంక చూశాను. 'నన్ను వదిలి పోతారా' అన్నట్టు దీనంగా చూస్తోంది.

నాకు చెప్పాలని ఉంది 'అవును రాజ్యం ఈ విషయంలో మాత్రం నేను స్వార్థపరుడ్నే! నువ్వులేని ఈలోకం నేను భరించలేను. ఆడదానివి — నీకు ఓర్పు ఎక్కువ. అందుకనే ఈ పందెంలో నే నే గెలుస్తున్నాను' అని.

కాని మాట్లాడేందుకు ప్రయత్నించ లేదు—లాభం లేదని తెలుసును గనక.

నా కంటి నిండుగా రాజ్యాన్ని చూస్తుండి పోయాను.

నా మనస్సు ఎక్కడికో తేలిపోతోంది.

రాజ్యం నా కంటికి రాను రాను మసక మసకగా అగపడుతోంది... ●